# ధర్మసాధని

[బ్రహ్మసాధనాశ్రమ పక్షమున ప్రతిశనివారము ప్రకటింపబడును.]

ధర్మంచర । ధర్మాత్ పరం నాస్తి । ధర్మః సర్వేషాం భూతానాంమధు.

సంపుటము ౮. | కాకినాడ:—శనివారము, డిశంబరు, ౩౧, ౧౯౨౧. | సం॥ చందా రు ౩.

సంచిక ౫౨. | విడిసంచిక అ ౧.

## ఓమ్.

స్వామీ! రక్షకా! దయానిధీ! ఈ ప్రాతఃకాలమున నేను నీ పాద సన్నిధిని చేరినాడను. నేను ఎట్లు నీకు నా కృతజ్ఞతా భావమును సంపూర్ణముగా వెల్లడింప గలనో నాకు తోచకున్నది. మై మరచి గాఢమైన నిద్రలో మునిగి యున్న అసహాయ స్థితియందు నీవు నన్ను వేయి కన్నులతో కనిపెట్టి కాపాడి యున్నావు. సుషుప్తిలో నున్న కాలమునందు కేవలము నేను అజ్ఞానావస్థయం దుంటిని. "నేను" ఎవ్వరో యెరుంగ జాలనైతి. నేను నేర్చుకొన్న విద్యాబుద్ధులు నాకు దూరమై పోయెను. నా శరీరముపై నాకెట్టి యధికారము లేదయ్యెను. నా ధన, గృహ, క్షేత్రముల గూర్చి చింతింపనేరనైతి. నా బంధు మిత్రుల గూర్చి నేను స్మరింపజాలకుంటిని. మృత్యు తుల్యమైన దీనదశనుండి నన్ను తిరిగి ఉద్ధరించినావు. "నేను" అను జ్ఞానమును నాకు మరల అనుగ్రహించినావు. చిరకాల సముపార్జితమైన నా జ్ఞాన సంపత్తికి నన్ను మరల అధికారిని చేసినావు. నాకు గల సమస్త వస్తువులను చూచుకొను భాగ్యమును దయచేసినావు. ప్రేమాస్పదులగు నా బాంధవకోటికి నేను తిరిగి ప్రీతిని కనబఱచు యోగ్యతను ప్రసాదించితివి. దిన దినమును నీవు చేయుచున్న ఈ మహోపకారమునకు నే నేమి ప్రతి కృతిని చేయ గల్గుదును? నేను నీ కెంతయు ఋణగ్రస్తుడనై యున్నాను. ఈ ఋణమునుండి విముక్తి పొందు మార్గము నాకేదియు కనుపించుట లేదు. నేను ఇదే నా కృతజ్ఞతాపూర్వక వందన శతముల నర్పించుచున్నాను. స్వీకరింపుము. జీవన ప్రదాతవగు నీ యిష్టమును గ్రహించి నేను జీవించెడు శుభబుద్ధిని నాకు అనుగ్రహింపుము. నీవు ఒసంగిన సకల శక్తులను నీ సేవకొరకై వినియోగించునట్లు కటాక్షింపుము. నేను ఈ దినమున చేసెడు సకల కార్యములను నీకు ప్రీతికరముగా సలుపునట్లు అనుగ్రహింపుము. నన్ను ఆశీర్వదింపుము. పా. స.

---

భాస్కరుడు ప్రకాశించుచుండ రాత్రి యెట్లుండ నేర్చును? రాత్రియైనచో సూర్యుడు తన రశ్మిని తొలగించి వేయును. జ్ఞాన మున్నచోట అజ్ఞానము నిలువ గల్గునా? అజ్ఞాన మున్నచో జ్ఞానము సమసి పోవ వలసినదే.

మోహ మున్నచోట ప్రేమ యెట్లుండ గల్గును? ఎక్కడ ప్రేమ యుండునో అక్కడ మోహ ముండదు.

కత్తిని పూని యుద్ధమునకు దిగుము. ప్రియ సోదరా! ప్రాణ మున్నవరకు పోరుము.

శిరమును త్రుంచి శత్రువును అంత మొందింపుము. పిమ్మట వచ్చి ప్రభువు మ్రోల వంగి నమస్కరింపుము. (కబీరు.)

---

# ఎక్కువవారు—తక్కువవారు.

—:o:-:o:—

IV

(శ్రీ జనమంచి సీతారామస్వామిగారు)

క్రిందటి వ్యాసములో వర్ణింప బడిన పరమ హంస కంటె నెక్కువ గౌరవమునకర్హులైన వార లనేకులు చండాల (అస్పృశ్య) జాతిలో నైన నుందురని నేను నమ్ముచున్నాను. కాని, మాలవాని పేరు చెప్పిన మండి పడు మహానీయుల కీయభిప్రాయము హృదయ శల్యముగ నుండు నేమో? ఉండిన నేమి? అంతరాత్మకు విధేయుడనగా లేను. నీతిలేని ఘనజు లెంతటి వారైనను శునకములకంటె గూడ దక్కువ వారనియే భావించెదను. ఏల యనగా, నా జంతువుల కతి ప్రశంస నీయమైన విశ్వాస గుణమైనను గలదు. ఈ కాలపు దౌర్భాగ్య మేమని చెప్పను! ఎంత ధన మున్న నంత హెచ్చు గౌరవ మబ్బును. ఎంత యధికారమున్న నంత గొప్ప తన్నన చేకూరును. ఎంత యెక్కువ వర్ణమైన నంత యధిక మర్యాద ప్రాప్తించును. ఆ ధనాధికార కులాధిక్యములు మూడును గాని—వానిలో నొకటిగాని—లేని వాడెంత యోగ్యుడైనను అమాయికపు జనట చచ్చుపెద్దమ్మ యై నట్లు చూడబడును. ఇట్లెంత కాలము?

సీ॥ అగ్నిసాక్షిగ పెండ్లియైన మానిని విడి
  పరకాంత మరగిన పాప చిత్తు
సద్వంశమున బుట్టి చదువు సంధ్యయు లేక
  ద్యూతాదుల దగులు దుండగీని
అతి ఘోరముగు వడ్డి కప్పిచ్చు వృత్తిని
  బహుమంది హింసించు బరమ క్రూరు
కడుపు గక్కుర్తికో కలిమి నార్జింపనో
  కన్నకూతుల నమ్ము కలుష మతిని
గీ॥ గౌరవించెడి వారికి గలదె బుద్ధి?
ఉత్తమ కులజుడైనను, విత్తవంతు
డైన, విద్యాధికుండైన నగును గాక
నీతిలేని నరుడు వర్జనీయు డన్న
మాట మఱచినారా? మీరు మాన్యులారా?

అని భారతమాత రాత్రిం బవల్లు విలపించుచుండుట లేదా? ఆమె దీనాలాపము లాలించు వారేరి? పదిమంది కలిసి తమకు వ్యతిరేకమైన యభిప్రాయముగల బుద్ధిమంతుల నైనను బహిష్కారాద్యుయథ ప్రయోగము చే బాధింప బూనుదురు గాని, నీతి బాహ్యులైన జాతి మాత్రోపజీవులమాట దల పెట్టనైన దల పెట్టరే! నస్పృశ్యవర్తనము దూష్యము గాదా? పాప మొనరించి నందులకు ప్రాయశ్చిత్తము లేదా? ధర్మము నకు దక్క పూజ్యమా? చండాలుని ముట్టకొన్న వాడు తత్క్షణమే స్నానము చేసి మడిబట్టలు గట్టుకొని, విభూతి పూసికొని, రుద్రాక్ష తావళములు ధరించి, తులసికోట దగ్గర గూర్చుండి, "సహస్ర గాయిత్రి" జపించిన గాని పరిశుద్ధుడు కాక పోవచ్చును. ఎందుచేత ననగా నతడు "అస్పృశ్యు" స్పృశించి పాపమున కొడిగట్టి ప్రాయశ్చిత్తమున కర్హుడయ్యెను.

అల్లుడు తాగుబోతైనను "స్పృశ్యుడే" అధికారి లంచగొండి యైనను 'స్పృశ్యుడే.' మిత్రుడు పోకిరీ యైనను 'స్పృశ్యుడే.' బంధువు బటాచోరైనను 'స్పృశ్యుడే' కాని, క్రైస్తవుడు మంచి వాడైనను 'అస్పృశ్యుడు.' మహామ్మదీయుడు యోగ్యుడైనను 'అస్పృశ్యుడు' చండాలు డుత్తముడైనను 'అస్పృశ్యుడు.' ఇట్టి విపరీత భావములు ప్రబలునంత కాల మే దేశ మభివృద్ధి పొందగలదు? నిజముగా నగౌరవ పాత్రులు, నస్పృశ్యులు నెవరని యడిగిన దుశ్చరితులే యని నొక్కి వక్కాణింప వలయును.

౧ ధనము నాశించి కూతుండ్రనే ముసలి వాండ్రకో పెండ్లిచేసి యనౌఖ్యవతులను జేయు స్వపుత్రికా ద్రోహులు 'అస్పృశ్యులు.'

౨ కూటసాక్ష్యము లిచ్చుచు, నెవరి కొంపలో తీయుచు డబ్బు సంపాదించుకొని జీవించు చుంటరులు 'అస్పృశ్యులు.'

౩ నిజ ధర్మపత్నులను విడిచిపెట్టి పరకాంతా యత్త చిత్తులైన కామాంధులు 'అస్పృశ్యులు.'

౪ సురాపానాది దుర్వ్యసనములకు వశులై పైకి పెద్దమనుష్యుల వలె నటించు నిందిత ప్రవర్తనులు 'అస్పృశ్యులు.'

ఇట్లే యవినీతిపరు లనదగిన వారందఱును 'అస్పృశ్య' జాతిలో జేరుదురని చెప్పదగిన వారే. కాని, యివన్నియు 'శ్రీరంగనీతులు'. పాటించువా రెంతమంది గలరు? నీతి చాటి నీతిదే. ఎవడిదాని వారిదే. కటా!

"శ్లో॥ వ్యాఘ్రీవ తిష్ఠతి జరాపరితర్జయన్తీ
రోగాశ్చ శత్రవ ఇవ ప్రహరన్తి దేహమ్,
ఆయుః పరిస్రవతి భిన్నఘటాదివామ్భో
లోకస్తథాప్యహితమాచరతీతి చిత్రమ్."

——

సత్యమేవ జయతే

# ధర్మసాధని

శనివారము, డిశంబరు, ౩౧, ౧౯౨౧.

## ఆస్తిక సమావేశము.

ఈ నెల ౨౭, ౨౮, ౨౯ తేదులను కడియం గ్రామములో ఆంధ్ర బ్రాహ్మమండలిచే ఆస్తిక సమావేశము జరుపబడెను. బరంపురము, పిఠాపురము, కాకినాడ, రాజమహేంద్రవరము, గుడివాడ, చీరాల, ఈపూరిపాలెము గ్రామములనుండి సుమారు ౧౫౦ మంది సమాజ సోదరీ సోదరులు సమావేశమయిరి. వారిలో శ్రీయుతులగు దివాన్ బహద్దరు ఆర్. వెంకటరత్నము నాయుడుగారు, వి. రామకృష్ణరావుగారు, వి. పి. రాజుగారు, కోకా వెంకట సుబ్బారావుగారు, జి. వెంకయ్యగారు, పి. నరసింహముగారు, డాక్టరు వి. వి. కృష్ణయ్యగారు, డాక్టరు పి. గురుమూర్తిగారు, టి. ప్రకాశ రాయుడుగారు, పి. రామస్వామిగారు, జి సుబ్బయ్యగారు, డి. వెంకయ్యగారు, డి. వి. కృష్ణ శాస్త్రిగారు, వి. వి ఎల్. నరసింహారావుగారు, డి. నారాయణరావుగారు మొదలగు ముఖ్యులు గలరు. సమావేశము ౨౭ తేది మధ్యాహ్నమునుండి ప్రారంభమయి ౨౯ తేది సాయంకాలముతో సమాప్తి నొందెను.

అందరు కలసి వసించి సభలు గావించుకొనుటకు ఏర్పాటు చేయబడిన శ్రీ పిఠాపురము రాజాగారి బంగాళా చాల విశాలము గలిగి సమావేశమునకు మిక్కిలి అనుకూలముగ నుండెను. అంతమంది చేరినను పరుండుటకు వేర్వేరు గదులు, భుజించుటకు ప్రత్యేకములయిన చావడులు, సభలు జరపుకొనుటకు మరియొక పెద్ద చావడి ఉండుటచే, ఏ యల్లరియు లేక అందరు నిశ్శబ్దముగ, సుఖముగ ఒక పెద్ద కుటుంబములోని వారి వలె మూడు దినములును గడపిరి. గ్రామ సమీపముననే గోదావరి కాలువ గలదు; మంచి రోడ్డు గలదు. ఉదయమున కాలువలో స్నానము చేయుటకు, సాయంకాలము రోడ్డుమీద షికారు చేయుటకు పలువు రరుగుచుండిరి. ఊరిలో చూడదగినది యేమియు లేకపోవుటచే, వచ్చిన వారెల్లరు భవనమున అందరితో కలసి ప్రేమ సంభాషణములు జరపుటయందో, ఊరి వెలుపలకు వెళ్ళి ప్రకృతి శోభను గాంచుట యందో కాలము పుచ్చుచు ఆనందమును పొందిరి. ఇతరులకు బ్రాహ్మధర్మమును గూర్చి బోధించుట గాక, బ్రాహ్మధర్మాను చరు లెల్లరు తమలో అన్యోన్య మైత్రి పెంపొందించుకొని భజనోపాసనాదుల పాల్గొని భక్త్యుత్సాహముల వర్ధిల్ల జేసికొనుటయె సమావేశోద్దేశమయి యుండుటచే, అందునకు సర్వ విధముల కడియం గ్రామము వీలుగనుండి సమావేశమును సార్థకము జేసెను.

౨౭ వ తేది సాయంకాలము శ్రీ పెద్దాడ రామస్వామిగారు భజనానంతరము ఈశ్వరోపాసన జరపిరి. అందరము కూడుట మిగుల యానందకరముగ నున్నదనియు, చేరి నందునకు ఒక్కొక్కరు పరస్పర ప్రేమాభివృద్ధికిని, బ్రాహ్మధర్మ వ్యాపనమునకును ఎంతెంతగ నడ్డు నిలచినది తమలో తాము బాగుగ విచారించుకొని చెదరిపోయిన హృదయముల నేకము చేసికొనుటకు, బ్రాహ్మధర్మ ప్రచారమునకు వలసిన మార్గముల నిశ్చయించుటకు పూర్ణ ప్రయత్నము గావింప వలయుననియు రామస్వామిగారు తమ ధర్మ ప్రసంగమున హెచ్చరించిరి. ౨౮ వ తేది యుదయమున శ్రీ కామరాజు హనుమంతరావుగారు ఈశ్వరోపాసన గావించి బ్రాహ్మసమాజము యొక్క ముఖ్య లక్ష్యము, సమావేశమునందును తరువాతను ఎల్లరు సాధింప వలసినది, ఈశ్వరభక్తి యనియు, మృదంగము, తాళములు, మున్నగునవి పెట్టుకొని నోటితో కీర్తనలు పాడుచు, ప్రార్థనలు సలుపుకొనుటయె, ఆత్మయోపాసన యనిపించుకొనదనియు, ఈశ్వరభక్తి ఎవరి యందు అవతరించి ఆత్మశక్తితో తేజరిల్లునో వారి యాత్మలనుండి వెలువడు ఉపాసనయె ఆత్మయోపాసన యనియు, అట్టిది సాధించుటకు అందరు పూని నప్పుడె

బ్రాహ్మసమాజోద్దేశము నెరవేర గలదనియు ముచ్చటించిరి. ౨౯ వ తేది యుదయమున భజన అయిన పిమ్మట శ్రీ ఆర్. వెంకట రత్నము నాయుడుగారు ప్రార్థన సలిపి, సమావేశమునకు వచ్చిన వారందరు ఎందునకు వచ్చితిమి, ఏమి యన్వేషింప వలయును, ఏమి గొంపోవలెను అని విచారించుకొనుట యావశ్యకమనియు, ఆ ప్రశ్నలు తమ్ము గూడ నెదుర్కొను చున్నవి గాన వానికి తగిన ప్రత్యుత్తరములుగ తమకు తోచిన విషయముల తెలిపెద మనియు, తామెచ్చటెచ్చట ఏయే కార్యములందు చరించినను తమ హృదయము ఆత్మ బంధు వర్గమయిన ఆస్తికుల వైపునకె మరలుచుండు ననియు, తామిప్పుడు స్వగృహమున జేరి తమ యాప్తుల నడుమ వసించు భాగ్యము లభించినందుల కమితానంద భరితుడ నగుచున్నా మనియు, తమ హృదయములో ఎవ రెవరు నిలచి యున్నారో వారితోడి సాంగత్యము, సంతోష సల్లాపము కంటె తా మన్వేషింప తగినది వేరేద్దియు లేదనియు, తన్మూలమున జనించు గాఢానురాగమె తముచే గొంపోబడి తమ వ్యక్తిజీవనమున వినియోగపడి సుఖము చేకూర్ప గలదనియు, ఇవి నెరవేరి నప్పుడె తమ రాక సఫల మయ్యెనని తలచెద మనియు, సోదాహరణముగ చేరిన వారి మనసు కరగు నటుల నొక చక్కని చిన్న ప్రసంగము గావించిరి. ౨౯ వ తేది సాయంకాలము శ్రీ పాలపర్తి నరసింహముగారి ఈశ్వరోపాసనతో సమావేశము ముగింపునకు తేబడెను. ఒకరి నొకరు చూచుకొని సంతోషించుట తోనె సమావేశము ముగియకూడ దనియు, తాము సాధింప వలసిన ధర్మము పట్ల ధైర్య స్థైర్యోత్సాహాదుల బడసి దాని నిర్వహణమునకై ఆత్మ సంశయముతో వారందరు పాటుపడ పూనవలె ననియు నరసింహముగారు గంభీరోపన్యాసము నొసంగిరి.

౩౦ తేది మధ్యాహ్నము ఆంధ్ర బ్రాహ్మమండలి యొక్క కార్యనిర్వాహక సభయు, సాధారణ సభయు కూడెను. మండలి సంబంధ మయిన కార్యములను గురించి కొన్ని తీర్మానములు కార్యనిర్వాహక సభయందు చేయబడెను. సాధారణ సభయందు మండలి యభివృద్ధిని గురించి కొంత చర్చ జరుప బడెను. కార్యాలోచన సభలు సక్రమముగ జరగి తగినంతగ ఫలప్రదములు గాకుండుట విచారకరము. కార్యాలోచనలను ఈశ్వర పరము జేసి శాంతిముగ జరుపు కొనుటకు నేర్చుకొని నప్పుడె మనము సాధన భజనలందు చూపు భక్తి మన జీవితములోనికి ప్రవేశించిన దని తలంచ వలసి యుండును.

# కాంగ్రెస్ వృత్తాంతము.

ఈ సంవత్సరపు కాంగ్రెసు సభలు ఈ నెల 27, 28, 29 తేదులయందు అహమ్మదాబాదు నగరమున ఉత్సాహముతో మహా వైభవముగ జరుప బడెను. పూర్వపు సభలవలె కేవలము ఆంగ్లేయ పద్ధతుల ననుసరించి విదేశీయ రూపము ధరించియుండక ఈ తూరి కాంగ్రెసు యదార్థముగ జాతీయ సంస్థయె జాతీయాకారము దాల్చెను. సభా భవన మంతయు ఖద్దరు గుడ్డతో అలంకరింపబడి జాతీయాత్మయొక్క పారిశుద్ధ్యమునకు బాహ్య చిహ్నముగ కన్పట్టెను. బల్లలు, కుర్చీలు మొదలగు అనవసరములగు అట్టహాసము లేక సభ్యులందరు ఖద్దరు గుడ్డతో కప్పబడిన నేలమీద కూర్చుండిరి. లోపల జాతీయ నాయకుల పటములు అమర్పబడి యుత్సాహ జనకముగ నుండెను. ప్రతినిధులు, ప్రేక్షకులు కలసి సుమారు ౬000 మంది చేరిరి. కార్య విహీనమయిన శుష్క వాగాడంబరములతో పొద్దు పుచ్చక దేశము నెదుర్కొను చున్న సమస్యను సాధించుటకు గాంధి మహాత్మునిచే తేబడిన తీర్మానములు చర్చింపబడి ఆమోదింప బడెను. మహాత్ముడు కాంగ్రెసు కమిటియొక్క సమస్త అధికారము చలాయించ వలెననియు, దేశీయులు యావచ్ఛక్తితో శాంతి సైన్యమును స్థాపించి తద్విషయమయిన రాజకీయాజ్ఞల నుల్లంఘించుటకు పూనవలె ననియు, చేయబడిన తీర్మానములు ముఖ్యములయినవి. ప్రేక్షకులుగ సభకు వెళ్ళిన పండిత మదన మోహన మాలవ్యగారు కాంగ్రెసు కృషిను సంతకము చేసి శాంతి సైన్యమును గూర్చి చేయబడిన యుత్తరువు లన్నియు అన్యాయము లనియు అవి యుల్లంఘించుట శాంతి సైనికుల విధి యనియు, చెప్పిరి. వీరి చర్య గాంగ్రెసు పక్షమునను బలపరచు చున్నది.

# బ్రాహ్మసమాజము.

—:o:—

కాకినాడ బ్రాహ్మసాధనాశ్రమ వర్థంతి.

ఈనెల ౨౫వ తేదిన కాకినాడ బ్రాహ్మసాధనాశ్రమ వర్థంతి జరుపబడెను. ఆశ్రమ మందిరము పచ్చని తోరణములతోను సుందర పుష్పములతోను అందముగ నలంకరింపబడెను. ఆశ్రమ సభ్యులు శ్రీ పాలపర్తి నరసింహముగారు, డి. నారాయణరావుగారు గుంటూరు బరంపురములనుండి యుత్సవమునకు వచ్చిరి. ఉదయమున అల్పాహారము లొసంగబడిన తరువాత శ్రీ పాలపర్తి నరసింహముగారు ఉపాసన జరిపి 'సేవ' ను గురించి ధర్మప్రసంగము చెప్పిరి. కాకినాడలోనున్నట్టియు బయట నుండి వచ్చినట్టియు ఆశ్రమ సభ్యులెల్లరును కొలది మంది మిత్రులును ఆశ్రమమున విందారగించిరి. ఆశ్రమాభివృద్ధిని గూర్చి ఆశ్రమ సభ్యులు నాటి మధ్యాహ్నము ఆలోచనలు సలిపిరి. ఈశ్వరానుగ్రహమున ఆశ్రమము వర్ధిలును గాక!

——

నామకరణము.

డాక్టరు వి. వి. కృష్ణయ్యగారికి నూతనముగ కలిగిన బాలికకు ఈనెల ౨౬ తేదిన నామకరణము చేయబడెను. తత్సందర్భముగా శ్రీ పాలపర్తి నరసింహముగారు ఉపాసన జరిపి బాలికకు స్వరాజ్య లక్ష్మీ దేవి యను నామ మొసంగిరి. ఈశ్వరుడు బిడ్డ నాశీర్వదించి ఆయురారోగ్యముల నొసంగి వర్ధిల్లజేయును గాక!

——

# ప్రేమ నిరూపణము.

—:o:o:o:—

ప్రాథమమౌ మానవ భాషతో గాని,
మధురమౌ దేవతా వచనముల గాని
భాషింప గల్గియు ప్రేమను లేకున్న
గణ గణ లాడెడి కంచు ఘంటల వలె
ఠంగు ఠంగు మనెడి తాళముల రీతిని,
బ్రతుకు దుర్భరమగును భావించి చూడ.
సాంగముగ వేదముల్ స్వాధ్యాయ మొనరించి
శబ్దార్థ జాలముల్ చక్కగా నెరిగియును,
ప్రవచించు భాగ్యమును బడసి యుండియును
కొండలను గదలింప గల యట్టి విశ్వాస
మతిశయించిన గూడ మది ప్రేమ లేకున్న
మానవ జన్మంబు మనకు గర్హ్యంబు.
బీదలను పోషింప పలు తెరంగుల మనము
మన యాస్తి నర్పించి మన దేహముల గూడ
మంటలో గల్పుటను మది నిశ్చయించియు,
ప్రేమను మదిలోన పొంకముగ లేకున్న
మన బ్రదుకు వ్యర్థంబు మన ఫలము శూన్యంబె!
సకల కష్టంబులు చాల కాలము వరకు
సహియించు నట్టిదే సరళమగు ప్రేమ.
సర్వకాలము లందు సంతోషమును దెల్పి,
దయజూపు నట్టిదే ధీరమగు ప్రేమ.
మాత్సర్యమును వీడి మంచిని గోరుచు
డంబమును విడనాడి దీనముగ వర్తించి
గర్వమును చూపనిదే కను చిత్రమౌ ప్రేమ!
మర్యాద హీనముగ స్వప్రయోజనముగ
త్వరితమౌ కోపముతో నపకారచింతతో
నెప్పుడును మెలగకను న్యాయముతో వర్తించి,
దుర్నీతి విషయమై సంతోషమును మాని,
సత్య విజయంబునకే సర్వదా నాశించి,
సకల విషయంబులను శాంతముగ తాళుకొని
అన్నిటిని నమ్ముచు సర్వంబు నోర్చుచు,
శాశ్వత కాలంబు చక్కగా నుండునదె
పరికించి చూడంగ పరిశుద్ధమగు ప్రేమ.
ప్రేమయే బ్రహ్మంబు బ్రహ్మమే ప్రేమయౌ!

ఇ. సు. కృ.

——

# విచిత్ర నరకములు.

—:o:—

చంద్రశేఖరుడు—ధనికుడు; దండవిధాయి.

గోవిందుడు—నిజువేద; విలేఖరి.

చం: మిత్రమా! పనియందు తగిలి మిక్కిలి బడలితిని. ఈ మందిరమున నేనుండజాల. సమీపమున నే యంగడి (restaurant) కలదు. మన మిద్దఱము పోయి మధురాహారముల గొన్ని పుచ్చికొని వత్తము. ఆలస్యమేల?

గో: అయ్యా! తమరు నన్నాహ్వానించుటచే ధన్యుడ నైతి. తమ రొనరించు సపర్యలు నాకు చుట్టినవి. నేను మాత్రము తమ వెంట రాజాల. కాఫీ దుకాణములకు నే బోవువాడను కానని తమ రెఱుగరా?

చం: చెలికాడా! అట్లయిన నీవు పొమ్ము. నాయొద్దగల యీహాపాయను వెచ్చించువఱకు తహ తహ పడుచుందును. ఎట్లయిన నే బోయి రావలయును. సాయంకాలమున నే నభ్యంతర మందిరమునం దుండెదను. కావలసినచో నీవు నను గలసికొన వచ్చును.

(చంద్రశేఖరుడు బిర బిర నడచి యట్టహాసముతో దుకాణము యొక్క ప్రాంగణమును జేరెను. వడి వడి కొంత నమలి—బుగ బుగ పొంగవచ్చు నీటిని కొంత త్రావి—చెమటను దుడిచి కొని—చేతులను ద్రిప్పుకొనుచు—దుకాణాధికారికి సొమ్ము చెల్లించిన యనంతరమున—యథోచితముగా తా నిలు చేరి గోవిందుని రాకకై వేచియుండెను.

చం: గోవిందా! నీవు మానవ మధ్యమున నుండదగిన వాడవు కావు. నీవు కేవలము పూర్వాచారుడవు. కాఫీ దుకాణములు నీకు సరిపడకపోయెగదా! ఇంటికి బోయి కొంత యన్నమును మాత్రము తిని యేమి భాగ్యము గట్టుకొంటివి?

గో: ఆర్యా! నాపై గినియకుడు. కాఫీ దుకాణములందు కాఫీని త్రావుట కల్లంగడియందు కల్లు ద్రావుట యగును. ఈవిషయమును బాగుగా గుర్తెఱిగియే నే బోవ నొల్లకుంటిని. ఆ యంగళ్ళయందు కొని తినుటకన్న పాసి ముఱిగి వీధులలో బడియుండు పండ్లను దినుట లాభకరమని చెప్పవచ్చును.

(చంద్రశేఖరుడు క్రోధారుణిత లోచనుడయ్యెను. పండ్లను బట పట కొఱకుచు వానిపై బడ నుంకించిన బెబ్బులివలె నతడు)

నే నంత వెఱ్ఱి యనుకొంటివా? నాకు దెలియక యింత సొమ్మును వెచ్చించుచున్నాడనా? కాఫీదుకాణములు చెడ్డవని విశదపఱుపుము. నేను నూరు రూపాయల పందె మొడ్డెదను.

గో: తమతో పందె మొడ్డునంతటి సాహుకారిని నే గాను. ఒడ్డి పోగొట్టుకొనునంతటి యవివేకము గూడ నాకు లేదు. కావలసినచో కాఫీ దుకాణముల గూర్చి యోపినంతమట్టు తెలియబఱతు. సావధాన చిత్తుడవై వినుము.

చం: నీవేమో చెప్పుచున్నాడవు. కానిమ్ము వినెదను.

గో: ఆర్యా! తమరు కాఫీ దుకాణములను గూర్చి మిక్కిలి శ్లాఘింతురు. దుకాణములకు బోయినచో మీ చిత్తము లాకర్షింపబడును. మీ మనస్సులను మీరు బిగియబట్టుకొనలేరు. మీరు భ్రమలో దగుల్కొనియుందురు. నిగ నిగ మెఱసెడి యా పింగాణి తట్టలను జూచియు, తళ తళ లాడుచున్న గిన్నెలను గాంచియు, సుస్నిగ్ధములగు బల్లలను బరికించియు మీరు సమ్మోహితులగుదురు. దుకాణములందమ్మెడి వస్తువు లెట్టివి? ఎట్లు చేయబడును? మొదలగు అంశములను మీ రాలోచించితిరా?

చం: ఆలోచించి యెఱుగను. దుకాణములందు గూర్చొని వారిని తెమ్మని యాజ్ఞాపించిన వారు తెత్తురు, నే దిందును. తదితర విషయములు నాకెఱుక లేదు.

గో: అదియే మీలో గనబడెడి తప్పిదము, మీరట్లు చేయరాదు. మరల వగచిన ప్రయోజనము లేదు. వారమ్ముచుండెడి పదార్థములను వారు ప్రతిదినము చేయరు. పదార్థములు చాల మిగిలియుండగా ఈగలు దోమలు వాని మీద పడి వ్రాలును. చీమలు కూడ చేరును. గాజుపాత్రములందు వారు తమ యంగడి పదార్థములను బెట్టి యీయగా మీ కేమియు గోచరింపదు. నిమ్మళముగా తిని లేచిపోదురు.

చం: అట్లనా?

గో: వారు శుభ్రముగా బదార్థములను జేయరు. బజారునందు కొని తెచ్చు వస్తువులను బాగుగా కడగరు. ఎంతమట్టుపురకపు సామానులు దొరకిన వారి కంత యాదాయము, వారు కొను నెయ్యి చొక్కముగా నుండదు. దానికన్న నూనె పలువిధముల మంచిదిగా గన్పట్టవచ్చును. మీరేమియు నాలోచింపక ప్లేటు వెంబడి ప్లేటును గప్పు వెంబడి కప్పును దెమ్మని వారి నాజ్ఞాపింతురు.

చం: వాస్తవమే. ఏమి చేయవచ్చును. కాఫీ నీటిని నేను రోజునకు నాలుమారులు త్రావవలెను. లేకున్న నా ప్రాణములు బోవును. ఆ మధురరసము నాకంత ముఖ్యముగ నేర్పడినది.

గో: కాఫీ చాల చెడ్డది. దానిని సరిగా వారు చేయరు. శీను విత్తనములను మాడ్చి కలుపుదురు. పాలు పేరునకు దెల్లగనుండును గాని నిజముగా ననేక పాళ్లు నీరుగలసి యుండును.

చం: నీవు పొరబడితివి. వారు చొక్కము పాలు గలుపుచుండగా నే జూచినాడను.

గో: నీకు విమర్శనా చాతుర్యము దక్కువ. బియ్యపుపిండి గలసిన నీరు తెల్లగ గన్పించుచుండును. ఇది వాస్తవ వృత్తాంతము. మీరేమో కాఫీని జూడగనే పోయిన ప్రాణములను దెచ్చికొనెదరు. ఈలోకమును మఱచి తప్పత్రావి మత్తెక్కినట్లు బడియుందురు.

చం: అయితే నేనింక యీ దుకాణములకు బోనని శపథమొనర్చుచున్నాను.

గో: నా ప్రసంగ మింకను ముగిసియుండలేదు గిన్నెలను దట్టలను గూర్చి కొంత ముచ్చటింపవలసియున్నది. తట్టలయందు ఎంగిళ్లు గలిసి యుండును. నానా జనుల యుమ్మినీరు మీకెంత యుపద్రవకర మగునో యోచింపుడు. గిన్నెలను వారు కడుగరు. అందలి పండ్లు దగిలి విష సమానములుగ నవి తోచును. వానిని ముట్టుకొన్న లేని రోగములు వచ్చు సుమా!

చం: నీ సంభాషణ వలన నే నొక నూతనాంశము నేర్చుకొంటి. నీవు బుద్ధిమంతుడవు. వివిధాంశముల గూర్చి నే నప్పుడప్పుడు నీతో ప్రస్తావించుచుండవలయు. సెలవిమ్ము పోయి వచ్చెదను.

వే. వెం.

## శ్రీరామ విలాస గ్రంథమాలిక.

శ్రీ చెలికాని లచ్చారావుగారు, (సంపాదకులు)

### శతకములు ప్రథమ సంపుటము.

ఇయ్యది పూర్వాధునిక సుప్రసిద్ధాంధ్ర కవివరులగు బమ్మెర పోతన్న ధూర్జటి కంచిగుంచి తిమ్మన్న అడిదము సూరన్న ప్రభృతులగు నిరువది మందిచే రచితములగు శతకరత్నంబు లిరువది గలిగి నాలుగువందల పుటలతో నొప్పుచు చదువరుల సౌఖ్యార్థమై చక్కని బైండు చేయబడి విరాజిల్లుచున్నది. భుక్తిముక్తి ప్రదంబులగు నీ శతకరాజంబు లాకతర చదివిన విడువ మనసొల్లదు ప్రతియింట నలంకరింప దగినది. వెల రు 2-8-0 లు మాత్రమే. విడి శతకములు గూడ దొరకును.

### దోమాడ యుద్ధము.

(చరిత్రాత్మకమైన నవల)

ఇయ్యది జగత్ప్రసిద్ధంబగు బొబ్బిలియుద్ధము తరువాత దోమాడవద్ద పద్మనాయక వెలమల మధ్య జరిగిన యుద్ధకథ. ఇందు వెలమవీరులు దేశ, ప్రభుభక్తి విశ్వాస తత్పరమతులై ప్రాణంబులు తృణప్రాయంబులుగ నెంచి రణరంగంబున తమ యవక్రవిక్రమ పరాక్రమాదుల వెల్లడించి ధన్యతగాంచిన వీరవరుల యద్భుతచరిత్ర వర్ణితము. పోస్టేజీతో రు 0-10-0 లు అడ్వాన్సు బిళ్ళ నంపిన 1922 సంవత్సరం క్యాలెండరు నెల్లవారికి ఉచితము.

మేనేజరు, శ్రీరామ విలాస గ్రంథమాలిక,

చిత్రాడ, పిఠాపురం, గోదావరి జిల్లా.





Buy our "BRIGADE" LEVER

WRISTLET

The only cheapest Lever Wrist Set with 10 rubies.

*Strong & Durable!*

Nickel ... Rs. 17. St. Silver ... Rs. 22-8.

,, Radium dial ,, 20. ,, Radium dial ,, 25-0

Guaranteed for Two Years.

Regulated & Tested before despatch.

*Supplied in a box with leather strap.*

ORDER TO DAY TO **M. H. Rao & Sons,** POST BOX NO. 29. COCANADA.



## P. SUBBAROY.

**Ayurvedic Pharmacy,**

*Sri Venkatesa Perumal koil Sannithy,*

TANJORE.

## పి. సుబ్బరాయి.

ఆయుర్వేద ఔషధశాల,

శ్రీవెంకటేశ పెరుమాళ్ళు సన్నిధి, తంజావూరు.


4. లక్ష్మీకర కస్తూరిమాత్రలు.—తాంబూలము ధరించువారు యెప్పుడున్ను చేతులోనే వుంచుకోతగినమాత్రలు. ప్రసిద్ధమైనవస్తువు పండ్లనొప్పి, నోటికంపు, అజీర్ణము, పిత్తవాయువు, కలరా, ప్లేగు, వీటిని పోగొట్టును తాంబూలములు గాని, పూటకగాని భోజనము అయినపిమ్మట 2 మాత్రలను వుపయోగపరచితే యేలాటి గొప్పభోజనము భోంచేసినా గాని తక్షణం జీర్ణముచేయుటయే గాక నోటిలో అనేక గంటలవరకు సుగంధవాసన యుండును. ప్రతిదినం తెల్లవారి రెండుమాత్రలను తింటూవచ్చినయెడల బహుకాలముగావుండే అగ్నిమాంద్యము, మలబద్ధము అజీర్ణమువల్ల కలిగెడు మలబద్ధము, కడుపునొప్పి, గొంతుమంటలు మొదలగు అనేక వ్యాధులను పోగొట్టును ప్రసవకాలమందు తాంబూలముతో నుపయోగపరిచిన సీతకాలము దగ్గర జేరనీయదు. జన్ని గావుండునప్పుడు ఈమాత్రలను యిచ్చినయెడల జన్ని పారిపోవును. ఇందులో లాహిరి మొదలగు అపాయకరమైన వస్తువులను చేరలేదు, కాశ్మీరదేశములోనుండి మేము నేరుగారప్పించిన కస్తూరి, బంగారురేకు, పచ్చకర్పూరము మొదలగు హెచ్చు ధరలుగల అనేక మందుసామానులున్ను వాసన ద్రవ్యములున్ను జేర్చి చేయబడినవి. తాంబూలముతో వుపయోగపరచితే పచ్చకర్పూరము మొదలగు వాసన వస్తువులను చేర్చవలసిన అవశ్యకమే యుండదు. పసిబిడ్డలకు తాంబూల రసములో యిచ్చినయెడల మాంద్యము, దగ్గు, జలుబు నివర్తియగును. సీసా 1 కి వుల అ 4. ఇండియాలోకి సీసా 1 టి మొ 12 సీసాలవరకు ప్యాకింగు తపాలు శెలవు అణాలు 8 ప్రత్యేకము.

### బొల్లికి మందు.

పైన వ్రాయవలసినది. ఒక వారము వాడిన తప్పక గుణమిచ్చును. మంటయుండదు. మెల్లగా పని చేయును. అన్ని తత్వములకు సరిపడును. ఒక సీసా ఖరీదు రు 2—0—0. 1 మొదలు 3 సీసాలవరకు వి. పి, చార్జి 8 అణాలు అధికము. మావద్ద దొరకు ఆయుర్వేద ఔషధముల యొక్క కేటలాగు కోరువారికి ఉచితముగా పంపబడును.

# అమృతాంజనము.

## సుందరమైన 1922 ఉపయోగమైన

## క్రొత్తక్యాలండరు

విక్రియమునకు సిద్ధముగనున్నది.

క్యాలండరు వెల 1 కి 0-4-0 వి. పి. ఖర్చులు సహా 0-6-0

వెంటనే వ్రాసుకొనవలయును.

| తామర తైలము | పండ్లపొడి | మోహినీ తైలము |
|---|---|---|
| డబ్బి 1 కి, 0-3-0 | డబ్బి 1 కి, 0-2-0 | సీసా 1 కి, 0-12-0 |

## అమృతాంజనము

అన్ని నొప్పులకు దివ్యామృతము.

దగ్గు, శైత్యము, పడిశము, రొమ్ము పడిశము, తలనొప్పి, వాయువు నొప్పులు, పోట్లు, బెణుకులు, బెళ్లలు, మొదలగు నొప్పులకు దివ్యామృతము.

చక్కని డబ్బితో సహా వెల రూ. 0-10-0. డజను 1 కి రూ. 6-0-0 పోష్టు ఖర్చులు వేఱు.

## అమృతాంజనము డిపో,

౧౪౯, ఫేర్రిరోడ్డు, ఫోర్టు, బొంబాయి, ౬, తంబుశెట్టివీధి, మదారాసు.

## ఇది చూడవద్దు

## చూచినచో మరువవద్దు

వైద్యరత్న పండిత

## డి. గోపాలాచార్యులుగారి

## ఇన్ఫ్లుయెన్జా

## కలరా ప్లేగు

వ్యాధులకు జగత్ప్రసిద్ధి చెందిన

## ఆయుర్వేద దివ్యౌషధములు

మా కలరా, ప్లేగుమందులకు

ముఖ్యప్రాశస్త్యము

20 వత్సరములుగ ఇండియా, బర్మా, సిలోను, పడాంగు మొదలగు చోట్ల అనేక వేల ప్రాణులను, కలరా, ప్లేగునుండి

## కాపాడుటయే

కలరా శెట్టు 1-కి రు 1-2-0

ప్లేగు శెట్టు 1-కి రు 2-2-0

ఇన్ఫ్లుయెన్జా శెట్టు 1-కి రు 1-12-0

క్యాటలాగు ఉచితము. ప్యాకింగు పోష్టు ఖర్చులు ప్రత్యేకము.

## ఆయుర్వేదాశ్రమం,

41 ఆచారప్పన్ వీధి, జి. టి. మదరాసు.



Reg. No. M. 1094.

The Dharma Sadhani, Cocanada.

Printed & Published at the Dharma Sadhani Press Cocanada, by the Editor, K. Hanumanta Rao.


To M. R. Ry. V. P. Rs. As.

16 Jayanti Gaganna garu B. A., L. T.,
Head Master, V. H. School,
Rajahmundry.